క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు


పూజలందుకుంటున్న దత్తాత్రేయ స్వామి

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామి వారికి విశేషపూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామి వారికి పంచామృతాభిషేకం , విశేషపూజలు నిర్వహించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి


రైతు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం కరివేన గ్రామంలో గురువారం మిరప పంటపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీఏ హార్టికల్చర్ సహాయకులు బీసీ ధనుంజయ మిరప పంటలను ఆశించే చీడపీడల గురించి వాటినివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. మిరపలో బ్లాక్ త్రిప్స్ ఉధృతి పెరగకుండా వేపనూనెను ముందస్తుగా పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ పరిధిలో చెంచు రైతులకు వివిధ పథకాలకు నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ మండల అధికారిణి చందన, ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం


మంటలు చెలరేగుతున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో గురువారం తెల్లవారుజామున పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు గాండ్ల గోవిందు పాడి పశువుల కోసం రూ.40వేలు వెచ్చించి పశుగ్రాసం కొనుగోలు చేసి గడ్డివాము ఏర్పాటు చేసుకున్నారు. పశుగ్రాసంలో మంటలు చెలరేగడంతో గమనించిన రైతు, చుట్టు ప్రక్కల ప్రజలు ప్రమాద సంఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేశారు. సమాచారం మేరకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాప్తి చెందకుండా ఆర్పేశారు. అయితే అప్పటికే పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతును ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య

మిడుతూరు: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. గురువారం మండలపరిధిలోని చింతలప్లి, నాగలూటి, చౌట్కూరు, దేవనూరు, కడుమూరు, సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం సచివాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

విద్యావైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయండి

ఆత్మకూరు: జనవరి 6, 7, 8వ తేదీల్లో యాగంటిలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దినేష్‌కుమార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, సాయి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు యా గంటిలో జిల్లాలోని ఎస్ఎఫ్ఐ నాయకులకు శిక్షణ ఇస్తామన్నారు. చివరిరోజు జిల్లా వర్క్‌షాప్ నిర్వహించి విద్యారంగంలో వస్తున్న మార్పుల గురించి చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాబు, అంజి, బాలాజీ, రవి, వంశీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం

- గ్రామీణ రహదారులు గుంతలమయం
- హామీలను గాలికొదిలేసిన కూటమి నేతలు
- కనీసం మరమ్మతులకు నోచుకోని వైనం
- గ్రామీణులకు తప్పని అవస్థలు


గుంతల మయంగా జీసీ పాలెం - సింగవరం రహదారి


సంతజూటూరు - జీసీ పాలెం రహదారి దుస్థితి

బండి ఆత్మకూరు : పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తామని కూటమి నాయకులు చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలి పోతున్నాయి. తాము అధికరంలోకి వస్తే గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీ అధికారంలోకి వచ్చాక వాటిని గాలికొదిలేశారు. మండలంలోని పలుగ్రామాల దారులు గుంతలమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. శాశ్వత మరమ్మతుల మాట ఎలా ఉన్నా, తాత్కాలిక మరమ్మతులు చేయడానికి కూడా ప్రభుత్వం ముందుకు రావడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారులకు నిత్యం నరకం

బండి ఆత్మకూరు మండల కేంద్రానికి అనుసంధానించే పలు దారులు ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. అవి పూర్తిగా గుంతలమయంగా మారిపోయాయి. ముఖ్యంగా జి.సి. పాలెం నుంచి బండిఆత్మకూరుకు వయా రామాపురం మీదుగా వెళ్లాలంటే మధ్యనున్న 8 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బ తినడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అలాగే బండి ఆత్మకూరు నుంచి యర్రగుంట్ల మధ్య 4 కిలో మీటర్ల ఉన్న మేర రోడ్డు అంతా గుంతల మయం కావడంతో ఆ దారిలో వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.

హడలెత్తిస్తున్న ఓం కారేశ్వరం రోడ్డు

ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఓం కారేశ్వర దేవస్థానానికి వెళ్లడానికి ఉన్న రెండు దారులు భక్తులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఈర్నపాడు నుంచి ఓంకారానికి వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి , బురుదమయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దారిలో రాత్రిపూట ప్రయాణం చేయాలంటే ప్రాణాలతో చెలగాటమేనని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావస్తున్నా కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక పోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణమంటేనే నరకం



జి.సి. పాలెం నుంచి బండి ఆత్మకూరు కు వెళ్లేదారి భారీ వాహనాలు తిరగడంతో పెద్ద గుంతలు ఏర్పడటంతో ఈ మార్గం ద్వారా ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తుంది. తక్షణమే గుంతలను పూడ్చి నూతన రోడ్లను నిర్మించాలి.

– రామ చంద్రుడు, సోమయాజులపల్లి గ్రామం

కనీసం మరమ్మతులైనా చేయాలి



మండలంలోని పలు రహదారులన్నీ అధ్వానంగా ఉన్నాయి. బండి ఆత్మకూరు నుంచి యర్రగుంట్లకు వెళ్లేదారి పూర్తిగా పాడు బడింది. అధికారులను ఎన్ని సార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– మారాసు. సుధాకర్, బండిఆత్మకూరు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి


క్రీడా మైదానం పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్, పూర్వ విద్యార్థి నాగిరెడ్డి

నందికొట్కూరు: స్థిరపడిని పూర్వ విద్యార్థులు, దాతలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందజేయాలని ఎంఈఓ సుభాన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థి నాగిరెడ్డి స్కూల్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ. 50 వేలు అందజేశారు. ఈ మేరకు చదును చేసిన మైదానాన్ని నాగిరెడ్డితో కలిసి ఎంఈఓ గురువారం పరిశీలించారు. అనంతరం పూర్వ విద్యార్థి నాగిరెడ్డిని హెచ్‌ఎం జుబేదా, ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ సన్మానించారు.

నిధులు విడుదల

నంద్యాల(న్యూటౌన్): వ్యాయామ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఏపీపీఈటీ అండ్ ఎస్ఏపీడీ అసోసియేషన్ ట్రెజరర్ సోమన్న యాదవ్ గురువారం తెలిపారు. ప్రైమరీ స్కూల్‌కు రూ.7వేలు, అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు రూ.14వేలు, హైస్కూల్‌కు రూ.30వేల ప్రకారం స్పోర్ట్స్ మెటీరియల్‌కు నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు.

పూర్వ విద్యార్థికి సన్మానం


ఏఏఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యశించి గ్రూప్ 1 ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏఏఓ) బాలగోవిందును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు గురువారం పదవ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయం, అపోహలను తొలగించి ఎక్కువ మార్కులను స్కోరింగ్ చేసే చిట్కాలపై ఆయన అవగాహన కల్పించారు. పదవ తరగతిలో వచ్చిన మెరిట్‌నే భవిష్యత్‌లో ప్రామాణికంగా తీసుకుంటారని ఏకాగ్రతతో ఇష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది బాలగోవిందుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు బోయ మధుగోపాల్ గాయపడ్డాడు. ద్వి చక్రవాహనంపై గ్రామానికి వస్తుండగా మలుపువద్ద కంపచెట్లు, రహదారి గుంతలా ఉండడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడని స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

శిక్షణ తరగతులను వాయిదా వేయాలి

ఆత్మకూరు: ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణలో భాగంగా ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ 6వ విడత శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.రాంపక్కీర్ రెడ్డి, సయ్యద్‌చాంద్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.వి.భాస్కర్‌రెడ్డి కోరారు. గురువారం వారు మాట్లాడుతూ ఈనెల చివరి వారంలో క్రిస్మస్ పండగ, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉన్నాయన్నారు. కాబట్టి క్రిస్మస్ పండగ నేపథ్యంలో క్రైస్తవ సోదరులైన ఉపాధ్యాయులకు సెలవు వినియోగం, ఐచ్ఛిక సెలవుల వాడకంలో ఎలాంటి ఆటంకం లేకుండా డిసెంబర్ 23–28 తలపెట్టిన 6వ విడత శిక్షణా తరగతులు వాయిదా వేయాలన్నారు.

త్వరలోనే వసతి గృహాల నిర్మాణం

- దేవదాయశాఖ డీఈ శ్రీనివాసప్రసాద్


ఈఓతో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాసప్రసాద్

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో వసతి గృహాల నిర్మాణాలను వీలైనంత త్వరగా ప్రారంభిస్తామని దేవదాయశాఖ డీఈ ఎం. శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి డీఈ శ్రీనివాసప్రసాద్ మహానందికి చేరుకుని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రూ.10.50 కోట్లతో నిర్మించనున్న వసతిగృహాల సముదాయంలో 55 వసతి గృహాలు ఉంటాయన్నారు. వాటిలో సాధారణ గదులు 41, సూట్ రూములు 14 నిర్మిస్తామన్నారు. వీటితోపాటు ఒక ఏసీ, ఒక నాన్ ఏసీ రెస్టారెంట్లు, స్టోర్ రూమ్, కిచెన్, మహిళలు, పురుషుల కోసం టాయిలెట్లు, రెండు లిఫ్టులు, ఒక స్టెయిర్‌కేస్ ఉంటుందన్నారు. ఇప్పటికే వసతిగృహాల సముదాయం కోసం అవసరమైన స్థలంలో సర్వే చేసి మార్కింగ్ వేశామన్నారు. త్వరలోనే గదుల నిర్మాణాలను ప్రారంభిస్తామన్నారు. వారి వెంట ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం చిన్నా పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు


కార్పెంటర్ షాపును పరిశీలిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: బాల కార్మికులతో పనులు చేయిస్తే యాజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని ఇన్‌చార్జ్ సీనియర్ సివిల్ జడ్జి దివాకర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ సంస్థ ఆదేశాల మేరకు నందికొట్కూరు మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఆపరేషన్ స్వేచ్ఛ ఫోర్త్ బాండెడ్ చైల్డ్ లేబర్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని దుకాణాలను జడ్జి, న్యాయవాదులు పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బాండెడ్ చైల్డ్ లేబర్‌ను అరికట్టాలన్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలతో వెట్టి చాకిరి చేయించడం వలన వారి భవిష్యత్తును నాశనం చేయడమేనని తెలిపారు. పిల్లలు పనులు చేయించడాన్ని చూసిన వ్యక్తులు వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, కోర్టుకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సమీర్, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, న్యాయవాదులు మద్దయ్య, వెంకటేశ్వర్లు, రహంతుల్లాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానంలో నిర్వహించే పూజలు, వైదిక కార్యక్రమాలన్నింటిని శాస్త్రోక్తంగా చేసేందుకు అందరూ సహకరించాలని మహానంది ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి కోరారు. దేవస్థానం కార్యాలయంలో గురువారం సాయంత్రం వేదపండితులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈశ్వరుడి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించే ఆరుద్రోత్సవ అన్నాభిషేకం సాధారణ వేళల్లో కాకుండా శాస్త్రోక్తంగా లింగోద్భవ సమయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి, 13న వార్షిక ఆరుద్రోత్సవం పూజలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తొమ్మిది రోజులు నిర్వహించేందుకు పరిశీలించాలని వైదిక కమిటీ వారు ఈఓను కోరడంతో.. దీనిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో వైదిక కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి


విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి తెలిపారు. రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువులు, ప్రభుత్వ కొలువుల్లో రిజర్వేషన్ పొందుతారన్నారు. పాఠశాల తరుపున తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పాండిచ్చేరి, రాజస్తాన్, జైపూర్, కేరళ, ఢిల్లీ తదితర 8రాష్ట్రాల్లో జరిగిన క్రీడల్లో పాల్గొని 9 గోల్డ్‌మెడల్స్, 22 సిల్వర్, 28బ్రౌన్‌మెడల్స్ సాధించడం అభినందనీయమన్నారు. అలాగే జిల్లాస్థాయిలో 300మంది, రాష్ట్రస్థాయిలో 165మంది, జాతీయస్థాయి క్రీడల్లో 20మంది విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లు తెలిపారు. అదే విధంగా వినయ్ అనే విద్యార్థి ఈనెల 23, 24 తేదీల్లో బీహార్‌లో జరగనున్న రగ్బీ క్రీడల్లో పాఠశాల తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డిని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, సుబ్బారెడ్డి, కృష్ణుడు, సుంకన్న, ఇస్మాయిల్, అనిల్‌కుమార్, నాగరాజు, రమణ, గోపాల్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సందడి


మహానందీశ్వరుడి దర్శనార్థం క్యూలో వేచివున్న భక్తులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో గురువారం భక్తుల సందడి కనిపించింది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులు సందర్శించారు.

మహానందీశ్వరుడికి కల్యాణోత్సవం

మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గురువారం నిత్య కల్యాణోత్సవంలో భాగంగా కల్యాణోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, ఆంజనేయశర్మ, హనుమంతశర్మల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో కల్యాణోత్సవం కమనీయంగా సాగింది.

ప్రకృతి వ్యవసాయ వరిలో పంటకోత ప్రయోగం


పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: మండలంలోని గుంతకందల గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా సాగు చేసిన వరి పంటలో పంట కోత ప్రయోగాలు ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటల దిగుబడి మొదట రెండు సంవత్సరాలు సాధారణ దిగుబడి కన్నా తక్కువ ఉన్నా.. తదుపరి మూడవ ఏడాది నుంచి మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. గుంతకందల గ్రామంలో 51 ,52 సర్వే నంబర్లలో సుంకరి సుబ్బరాయుడు అను రైతు పొలంలో సాగు చేసిన వరి పంటలో పంట కోత ప్రయోగాలు చేయగా ఎకరానికి 47 బస్తాలు దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులు ప్రకతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సేంద్రియ ఎరువులు సహజ ఎరువులు వాడి ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులు పండించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అజిత్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది అప్సర్, ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఎన్.ఎఫ్ మహబూబ్ బాషా, నాగరాజు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు


గాయపడిన నాగలక్షమ్మను పరామర్శిస్తున్న ఎస్ఐ కేశవ

కొత్తపల్లి: ట్రాక్టర్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటన గురువారం రాత్రి మండల పరిధిలోని దుద్యాల, కొత్తమాడుగుల రహదారి మధ్యలో చోటుచేసుకుంది. ఘటనలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన నాగలక్షమ్మ, రంగస్వామి దంపతులు కొడుకు వివాహానికి సంబంధించి సరకులు తీసుకొచ్చేందుకు ఆటోలో ఆత్మకూరు పట్టణానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అదే సమయంలో ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ ట్రాక్టర్ కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు గ్రామం నుంచి కట్టెలు వేసుకుని తిరిగి వెంకటాపురం వెలుతుంది. ఈ క్రమంలో దుద్యాల, కొత్తమాడుగుల మధ్యలోని సుద్దవాగు వద్ద ఎదురుపడ్డాయి. ఆటో ట్రాక్టర్‌ను క్రాస్ చేసే సమయంలో వెనుకభాగానా బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న నాగలక్ష్మమ్మ, రంగస్వామితో పాటు గ్రామానికి చెందిన నారాయణమ్మకు రక్తగాయాలు అయ్యాయి. అటుగా వెళ్తుతున్న ప్రయాణికులు క్షతగాత్రులను మరో ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎం.కేశవ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు


రైతు అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్రమ్మ

పగిడ్యాల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివరాముడు సూచించారు. మండల పరిధిలోని కొత్తముచ్చుమర్రి గ్రామంలో గురువారం తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ నిర్ణీత సమయంలో సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరంగారెడ్డి, సర్వేయర్ జ్ఞానప్రకాష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరు సచివాలయంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏడుగురు రైతులు వినతి పత్రాలు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మమ్మ, మండల సర్వేయర్ కృష్ణుడు, ఆర్ఐ జహంగీర్, వీఆర్వోలు వెంకటయ్య, పుల్లారెడ్డి, పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో గురువారం తహసీల్దార్ సుభద్రమ్మ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి ఆన్‌లైన్ నమోదుకు 1, భూమి సర్వేకు 1 చొప్పున 2 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, డీటీ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, సర్వేయర్ కలిముల్లా, వీఆర్వోలు సాములు, శివన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మద్దిలేటి, పురందరుడు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని గుమ్మడాపురం గ్రామ పంచాయతీలో గురువారం తహసీల్దార్ ఉమారాణి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలు పరిష్కరించాలని ఏడుగురు రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు నక్క విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు


ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు: పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక బస్టాండ్ సెంటరులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతను అవమానిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దేశాన్ని మత విద్వేషాలతో కాకుండా రాజ్యాంగ విలువలతో పరిపాలించాలని హితవుపలికారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, అంకన్న, రాజు, షన్షక్షాఅలీ, శిరీష, సాయిక్రిష్ణ, దరగయ్య, శ్రీనవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అమిత్‌షాను పార్లమెంట్ నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహానాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, కేవీపీఎస్ జిల్లా నాయకులు భాస్కర్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం ఆత్మకూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, నాయకులు సురేంద్ర, ఇస్మాయిల్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.